నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 14 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

రేపు యాదగిరి గుట్టలో కార్తిక పౌర్ణమి వేడుకలు

యాదగిరిగుట్ట, నవంబర్13 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం కార్తిక శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొండకింద వ్రత మండపంలో 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు నిర్వహించేందుకు కావాల్సిన పనులను దాదాపు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రూ. 800 రుసుముతో వ్రతానికి కావాల్సిన సామగ్రి సమకూర్చారు. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు కొనసాగించనున్నారు. అందుకనుగుణంగా వ్రత మండపాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు.

శివాలయంలో సామూహిక కార్తిక దీపోత్సవం

కార్తిక శుద్ధ పౌర్ణమి సందర్భంగా 15న కొండపైన అనుబంధ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సాయంత్రం 5.30 గంటలకు సామూహిక కార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ భాస్కర్ రావు వెల్లడించారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

కార్తిక పౌర్ణమి (15వ తేదీన) సందర్భంగా సత్యనారాయణ వత్రాల సమయం ఇలా..

మొదటి బ్యాచ్ ఉదయం 5.30 గంటలకు
2వ బ్యాచ్ ఉదయం 7.30 గంటలకు
3వ బ్యాచ్ ఉదయం 9.30 గంటలకు
4వ బ్యాచ్ ఉదయం 11.30 గంటలకు
5వ బ్యాచ్ మధ్యాహ్నం 1.30 గంటలకు
6వ బ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు
7వ బ్యాచ్ సాయంత్రం 5.30 గంటలకు
8వ బ్యాచ్ సాయంత్రం 7.00 గంటలకు



మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి. తదితరులు

2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలకు..

బోనస్ సున్నా

మంత్రి కోమటిరెడ్డి సమీక్షలోనూ బోనస్‌పై మౌనమే

- నేరుగా మిల్లర్లకే అమ్ముకుంటున్న రైతులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రాని సన్న వడ్లు
- తేమశాతం, ఇతర నిబంధనలే అడ్డంకి
- దొడ్డు వడ్లకు రూ.160కోట్లకు గానూ చెల్లించింది రూ.52కోట్లే
- ధాన్యం డబ్బుల చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం

ప్రభుత్వం, మంత్రులు ఇప్పటికీ సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ఆర్భాట ప్రకటనలు బోగస్ అని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు మొదలై నెలరోజులు దాటినా నేటికీ ఆచరణలో ఎక్కడా ఒక్క క్వింటా సన్న వడ్లకు కూడా బోనస్ ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు గతంలో ఎన్నడూ సన్నవడ్లు వచ్చిన దాఖలాలు లేవు. కానీ ఇక్కడికి సన్నవడ్లను తెస్తేనే బోనస్ అని మెలిక పెట్టడంలోనే ప్రభుత్వ ఉద్దేశమేంటో స్పష్టం అవుతున్నది. దీంతో ఇప్పటికే నల్లగొండ జిల్లాలో రైస్‌మిల్లర్లు కొనుగోలు చేసిన సన్నవడ్లు 2.83లక్షల మెట్రిక్ టన్నుల్లో ఒక్క టన్ను వడ్లకు కూడా బోనస్ వర్తించలేదు. కేవలం రైతులు మద్దతు ధరకు అటు ఇటుగా మిల్లర్లు చెప్పిన ధరకే సన్నాలను విక్రయించి మిన్నకుంటున్నారు. నిజంగా ప్రభుత్వానికి సన్నాలకు బోనస్ ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే రైస్‌మిల్లర్లకు అమ్మిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అయితే బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షలో సన్నాలు, వాటి బోనస్‌పై ఎలాంటి చర్చ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనల వల్ల ఇప్పటికే విక్రయించిన సన్నాలకు రూ.140 కోట్ల వరకు బోనస్‌కు ప్రభుత్వం ఎగనామం పెట్టినట్లే.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్13(నమస్తే తెలంగాణ)

ఉమ్మడి జిల్లాలో పండించిన సన్నవడ్లల్లో మెజార్టీ భాగం మిర్యాలగూడ ప్రాంతంలోని రైస్‌మిల్లులకే తరలివస్తుంటాయి. సన్నాలను ఆరబెట్టడం, ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం రావడం, దుమ్ముదూళి లాంటి వాటి తొలగించడంలో ఉన్న సమస్యల నేపథ్యంలో నేరుగా రైస్‌మిల్లర్లకే విక్రయించడం ఆనవాయితీ. ప్రస్తుత వానకాలం సీజన్‌లోనూ రైతులంతా మిర్యాలగూడ ప్రాంత మిల్లులకే బారులు తీరారు. దాదాపు నెల రోజులుగా నాన్‌ఆయకట్టు నుంచి సన్నాలు రాగా, ప్రస్తుతం సాగర్ ఆయకట్టు నుంచి రాక మొదలైంది. ఇలా ఇప్పటికే జిల్లాలోని రైస్‌మిల్లర్లు 2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేసినట్లు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ వెల్లడించారు. ప్రతిరోజూ 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఆయకట్టులో వరికోతలు ముమ్మరం అయితే మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన సన్నాలకు మద్దతు ధరకు అటు ఇటుగానే రైతులకు ధర లభించింది. కానీ ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ మాత్రం వర్తించడం లేదు.

నల్లగొండలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం లోడింగ్ చేస్తున్న కార్మికులు

సన్నాలకు సున్నా బోనస్

ప్రభుత్వం ఈ సారి సన్నాల కొనుగోలు కోసమే 80 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. కానీ నేటికీ ఒక్క క్వింటా కూడా ఈ కేంద్రాలకు సన్నవడ్లు రాలేదని అధికారులే చెప్తున్నారు. సాగర్ ఆయకట్టులో కోతలు షురూ అయితే రావచ్చని భావిస్తున్నారు. కానీ ఆచరణలో సన్నవడ్లు కేంద్రాలకు రావడం దాదాపు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే గతంలో ఎన్నడూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నాలు వచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిబంధనల ప్రకారం సన్నవడ్లకు సైతం ఒక్క పైసా బోనస్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ సన్నాల రైతులు ఇప్పటికే నేరుగా రైస్‌మిల్లర్లకు 2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నవడ్లను విక్రయించారు. కానీ ఇందులో ఒక్క టన్నుకు కూడా బోనస్ వర్తించలేదు. ఎందుకంటే ప్రైవేటుగా విక్రయిస్తే బోనస్ లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నది. వాస్తవంగా రైతులు ఇప్పటికే విక్రయించిన సన్నాలకు బోనస్‌ను వర్తింప చేస్తే రైతులకు రూ.140 కోట్ల వరకు డబ్బులు అదనంగా వచ్చేవి. కానీ అలాంటి పరిస్థితులు కనిపిస్తలేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధాన్యంపై జరిపిన సమీక్షలోనూ సన్నాల బోనస్ ఎక్కడా చర్చ రాకపోవడంతో ప్రభుత్వం ఎగ్గొట్టడానికే సిద్ధంగా ఉన్నట్లు రైతులు భావిస్తున్నారు. రైతులు మాత్రం రైస్‌మిల్లులకు విక్రయించిన సన్నవడ్లకు సైతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండడం విశేషం. ప్రభుత్వానికి నిజంగా బోనస్ ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే రైతు ఎక్కడ అమ్ముకున్నా ఇవ్వాలని కోరుతున్నారు.

దొడ్డు వడ్లకు చెల్లించింది రూ.52 కోట్లే..

మరోవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జరుగుతున్న కొనుగోళ్లల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా ధాన్యం డబ్బుల చెల్లింపులో ఆలస్యం అవుతున్నది. సివిల్ సప్లై అధికారుల లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో 340 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుపుతున్నారు. మంగళవారం నాటికి జిల్లాలో 69వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీని విలువ రూ.160.92 కోట్లుగా ప్రకటించారు. అయితే ఇందులో రైతులకు చెల్లించిన డబ్బులు మాత్రం రూ.52కోట్లే కావడం గమనార్హం. గతంలో మూడునాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాగా ప్రస్తుతం వారం నుంచి 15 రోజుల వరకు సమయం పడుతున్నది. ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం కావడం, ట్రక్‌షీట్లను పూర్తి చేయకపోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. ఇదే విషయమై బుధవారం మంత్రి కోమటిరెడ్డి సమీక్షిస్తూ దీనిపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసిందే. డబ్బుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యాన్ని గుర్తించి మరో రెండు రోజుల్లోనే ఇంకో రూ.50కోట్ల డబ్బులు చెల్లించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు దుఃఖం తప్పడం లేదు

- జిల్లాలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసే దుస్థితి ఏర్పడింది
- జిల్లాలో సివిల్ సప్లయ్ మంత్రి ఉండి కూడా ప్రయోజనం లేదు
- మంత్రులు గాలి మోటర్లు దిగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటించాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు
- మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలన

మర్రిగూడ, నవంబర్ 13 : సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు దుఃఖం తప్పడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. వడ్లు తెచ్చి ఎన్ని రోజులు అవుతుందని అడిగారు. ఇప్పటివరకు ఏమైనా వాటి డబ్బులు అందాయా అని అడుగగా వడ్లు అమ్మి వారం రోజులైనా ఒక్క రూపాయి కూడా ఇప్పటి వరకు రాలేదని రైతులు వెల్లడించారు. దొడ్డు రకం వడ్లను మర్రిగూడలో.. సన్న రకం వడ్లను యరగండ్లపల్లిలో ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సన్నాలు ఇప్పటివరకు కొనడం లేదని మాజీ మంత్రి ఎదుట రైతులు వాపోయారు. తరుగు పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో సివిల్ సప్లయ్ మంత్రి ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేదని.. ఇప్పటివరకు రైతులకు రూపాయి చెల్లించ లేదన్నారు. మంత్రులు గాలి తిరగడం మాని భూమి మీదకి రావాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు అయితే, సాగితే ఈసారి పుష్కలంగా నీళ్లు ఉండటం వల్ల ఐదున్నర లక్షల సాగు జరిగిందని తెలిపారు. ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. ధాన్యం దిగుబడి అంచనా వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా, రుణమాఫీ సరిగా చేయకుండా, పండించిన పంటలను కొనకుండా ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మండిపడ్డారు. జిల్లాలో ఇప్పటివరకు సన్నవడ్లను కొన్న దాఖలాలు లేవని, రేవంత్ రెడ్డి బోనస్ ఎలా ఇస్తాడని ప్రశ్నించాడు. రూ.1800కే క్వింటాలు చొప్పున అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే 200 రూ.కోట్లు చెల్లించాల్సి వస్తుందని.. అందులో ఇప్పటివరకు 50 కోట్లు మాత్రమే చెల్లించాలని అన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదని చెప్పారు.

రైతుల ధర్నాలు రాస్తారోకోలు...

వడ్లకు మద్దతు ధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. కాటన్ మిల్లుల దగ్గర పత్తి రైతులు ధర్నాలు చేస్తున్న పరిస్థితిని చూస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వాన్ని నమ్మలేకనే దళారులను ఆశయించి వడ్లను అమ్ముతున్నారని తెలిపారు. కేసీఆర్ కరోనా కష్టకాలంలో కూడా రైతులకు రైతు బంధు కింద సాయం అందించడమే కాకుండా పండించిన పంటలను నిరాటంకంగా కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కళ్లు తెరవాలన్నారు. ఈ యాసంగి పంటకైనా రైతులకు రైతు భరోసా కింద సాయం అందించాలని డిమాండ్ చేశారు.

గ్యారెంటీలకు ఇజ్జత్ లేకుండా చేసిన ప్రభుత్వం..

కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ అనే పదానికి ఇజ్జత్ లేకుండా చేసిందని హరీశ్‌రావు మండిపడ్డారు. రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం, మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని గ్యారెంటీ ఇచ్చినట్లు చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్యారెంటీలకు, బాండ్ పేపర్లకు విలువ, నమ్మకం లేకుండా పోయిందని విమర్శించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద రైతులందరికీ రుణమాఫీ చేస్తానని ఒట్టు వేసిన రేవంత్ రెడ్డి సగం మందికి కూడా పూర్తిస్థాయిలో మాఫీ చేయలేకపోయారని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి, రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు బాల నరసింహ, పందుల యాదయ్య, మాజీ సర్పంచులు నల్ల యాదయ్య, చెరుకు లింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ ఊరి పక్కన నగేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్, నాయకులు రాపోలు యాదగిరి, కోలుకులపల్లి యాదయ్య, వల్లంల సంతోష్ యాదవ్, లప్పంగి భిక్షం, పగడాల రఘు, వట్టికోటి శేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

వలిగొండ, నవంబర్13: మండలంలోని వెంకటాపురంలో మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాఢవీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి రంగు రంగుల పూలతో అలంకరించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి మెడలో స్వామి వారు మంగళసూత్రధారణ చేసే ఘట్టాన్ని నయనానందకరంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేసి కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు జంపాల రాంబాబు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, ఈఓ సల్వాద్రి మోహన్‌బాబు, ధర్మకర్తలు కొడితాల కరుణాకర్, అరూరు వెంకటేశం, రేఖల ప్రభాకర్, మైసోళ్ల అంజయ్య, బండి రవికుమార్, గుండు జగన్‌మోహన్‌రెడ్డి, అంబాల ఊషయ్య, ఈతాప రాములు, జక్కల కేతమ్మ, మైసోళ్ల వెంకటేశం, కొమిరే బాలేశ్వర్, కందుల శ్రీను, గజ్జల అమరేందర్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి కల్యాణ తంతులో సంప్రదాయాలను విస్మరించడంపై ఈఓను నిలదీసిన భక్తులు

మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని మొక్కును చెల్లించుకోవడానికి వెయ్యి రూపాయలు పెట్టి టికెట్ కొనుగోలు చేసిన భక్తులు అధికారులు, అర్చకుల తీరుతో విస్మయం వ్యక్తం చేశారు. స్వామి వారి కల్యాణ సయమంలో నిర్వహించే సంప్రదాయాల తంతు సందర్భంగా దంపతులు కంకణాల మార్పిడి, భార్యాభర్తలు ఒకరికొకరు కుంకుమ తిలకధారణలను భక్తులతో చేయించలేదు. స్వామి వారి కాళ్లు కడిగి కన్యాదానం చేయడానికి కూర్చున్న దంపతులను పూర్తిగా విస్మరించి కల్యాణ తంతు నిర్వహించారు. కల్యాణ మూర్తులను మాఢవీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారేగాని ఎదుర్కోళ్ల ఘట్టాన్ని విస్మరించినట్లు కనిపించింది. ఈ మేరకు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో కల్యాణం టికెట్లు కొన్న భక్తులు ఈఓ మోహన్‌బాబును నిలదీశారు. సామాన్య భక్తులకు తమకు ఏమి తేడా లేదని అడిగారు.

ఇంటింటి సర్వేపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా..?

- సర్వేలో సమగ్ర ప్రణాళిక, పారదర్శకత ఏది..?
- ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి సర్వే చేపట్టాలి
- రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతోనే ప్రజల దాడులు : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- వీధి రౌడీలా రేవంత్ రెడ్డి వ్యవహారం : బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్

భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, చిత్రంలో క్యామ మల్లేశ్ తదితరులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇంటింటి సర్వేపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా అని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. సర్వే సరిగ్గా లేదని, పారదర్శకంగా చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. భువనగిరి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వే పై ప్రజలకు ఉపయోగం ఏమిటో స్పష్టంగా చెప్పాలని, వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి సర్వే చేయాలని తెలిపారు. అనాలోచిత నిర్ణయాలతో సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రజలు అధికారులపై తిరగబడ్డారని చెప్పారు. రేవంత్ రెడ్డి భాషను అనుకరిస్తూ.. ప్రజలు అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. కొడంగల్ దాడి ఘటనలో రేవంత్ రెడ్డిని కుట్రదారుగా చేయాలన్నారు.

సర్వే పై లోపించిన పారదర్శకత

గతంలో కేసీఆర్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వేను ఒక్కరోజులో రాష్ట్రం మొత్తంలో 1.30 లక్షల కుటుంబాలకు 3,80 వేల మంది ఎన్యూమరేటర్లతో కుటుంబ సర్వే చేపట్టారని గొంగిడి సునీత మహేందర్ రెడ్డి గుర్తు చేశారు. అప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక వివరాలు చెప్పాడ్దని చెప్పి.. నేడు ఎందుకు సర్వే చేపడుతున్నారని ప్రశ్నించారు. 60 రోజుల సమయం పెట్టడంతో పనులు మానుకొని ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. సర్వేలో పూర్తిగా పారదర్శకత లోపించిందని చెప్పారు. సీఎం అనాలోచిత నిర్ణయాలు, సమగ్ర ప్రణాళిక లేకపోవడంతో సర్వే సక్రమంగా జరుగడం లేదన్నారు. ఎస్సీ కులగణన చేయాలని సుప్రీం కోర్టు ఆదేశిస్తే రాష్ట్రంలో ముందు చేసి ఆదర్శంగా నిలుస్తామన్న మాట ఏమైందన్నారు. పాలకుడు ఏ విధంగా మాట్లాడుతారో ప్రజలు కూడా ఆ విధంగానే నడుచుకుంటారని, లగుచర్ల ఫార్మా ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులపై దాడులే ఇందుకు నిదర్శనమని తెలిపారు. మూసీపై డీపీఆర్ తయారు చేయలేదని, తల తోక లేకుండా కిలోమీటర్ నడిచి పాదయాత్ర అనడం సిగ్గుచేటన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న రాష్ట్రాన్ని అభాసుపాలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. మంచి పనులు చేసే స్వాగతిస్తామని, లోటుపాట్లు ఉంటే ప్రజల పక్షాన నిలబడి తప్పకుండా ప్రశ్నిస్తామన్నారు. హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకు హైడ్రా, మూసీ, సినీ సెలబ్రిటీలపై అడ్డగోలు వ్యాఖ్యలు చేస్తూ డ్రామా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలయాపనతో పాలన : క్యామ మల్లేశ్

రాష్ట్రంలో పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేయడం, పొలిటికల్ డైవర్షన్‌కు పాల్పడుతూ కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ మండిపడ్డారు. 11 నెలల కాలంలో ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని, రేవంత్ రెడ్డి వ్యవహారం వీధి రౌడీలా ఉందని అన్నారు. తన స్థాయి మరిచి, సీఎం హోదాను వీడి బు ల్డోజర్‌తో తొక్కిస్తాం.. నరికేస్తాం.. పీకేస్తాం అని మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాష తీరు మార్చుకోవాలని, తెలంగాణ ప్రతిష్టతను దిగజార్చ వద్దని హితవు పలికారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని, అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని స్పష్టం చేశారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రైతు బంధు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, మాజీ జడ్పీటీసీలు బీరు మల్లయ్య, తోటకూర అనురాధ, నాయకులు అతికం లక్ష్మీనారాయణ గౌడ్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంవీ కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 13 : టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్, స్ట్రాంగ్ రూమ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి మాట్లాడారు. బయోమెట్రిక్ విధానంపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి పలు సూచనలు చేశారు. నూరు శాతం బయోమెట్రిక్ అటెండెన్స్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాల్లో 6,043 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని, ఇందులో పురుషులు 3,240 మంది, స్త్రీలు 2,803 మంది ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరిటెండెంట్స్-15, బయోమెట్రిక్ అధికారులు-46, అబ్జర్వర్లు-17, జాయింట్ రూట్ అధికారులు-3, ఫ్లైయింగ్ స్క్వాడ్స్-5, డిపార్ట్మెంట్ అధికారులు-15, ఐడెంటిఫికేషన్ అధికారులు-65, ఇన్విజిలేటర్స్-253 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12-30గంటల వరకు పేపర్1(జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష, సాయంత్రం 3 నుంచి 5:30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందని చెప్పారు. 18వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు, సాయంత్రం జరిగే పరీక్ష కోసం 1:30 గంటలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు నలుపు, నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్ దానిపై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డ్‌ను పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలని, సెల్‌ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్‌లతోపాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్ష ఎంట్రెన్స్ గేట్, పరీక్ష కేంద్రాల్లో టేబుల్, కుర్చీలు ఏర్పాటు చేసి, శానిటైజ్ చేపట్టాలన్